

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (శని)
సహరి : 4.39 (ఆది)

ఇక్కడ ఇల్లు కట్టలేం!

ఆంధ్రజ్యోతి విజిట్



భీమవరం మండలం కొమరాడలో ఒక ఇల్లు కూడా నిర్మించకుండా ఉన్న జగనన్న లే-అవుట్

అనువుగా లేని జగనన్న లేఅవుట్లు.. ఏళ్లు గడుస్తున్నా ఖాళీగానే స్థలాలు

- ఊరికి దూరంగా శ్మశానాలకు దగ్గరగా.. రోడ్డు కూడా లేని చోట్ల పంపిణీ
- ఇళ్లు కట్టుకునేందుకు మక్కువ చూపని వేలాది మంది లబ్ధిదారులు
- నెరవేరని సొంతింటి కల.. జిల్లాల్లో పదుల సంఖ్యలో ఖాళీ లే అవుట్లు
- భీమవరంలో 3,958 మందికి అందని ద్రాక్షగా ఇంటి స్థలం
- ప్రత్యామ్నాయం చూపాలని కూటమి ప్రభుత్వానికి వినతులు

ప్రధానమంత్రి ఆవాస యోజనలో గత ప్రభుత్వం కేటాయించిన జగనన్న ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు నత్తనడకగా సాగాయి. పల్లెటూరులో పట్టణ ప్రజలకు సెంటు స్థలం కేటాయించారు. అది కూడా ఐదు నుంచి పది కిలోమీటర్ల పరిధిలో స్థలాలు ఇచ్చారు. దీనివల్ల పట్టణ లబ్ధిదారులు సెంటు స్థలంలో ఇంటి నిర్మాణానికి మొగ్గుచూపడం లేదు. మరోవైపు డెల్టా ప్రాంతంలో ఇల్లు కట్టుకోవాలంటే పెట్టుబడి వ్యయం అధికం అవుతోంది. మట్టి స్వభావాన్ని బట్టి పిల్లర్లతో నిర్మాణం చేపడుతున్నారు. నాణ్యతతో ఇల్లు కట్టుకోవాలంటే రూ. 5 లక్షల వెచ్చిస్తున్నారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తోంది. ఫలితంగా జిల్లాలో 72 వేల ఇళ్లకు 60 శాతం పూర్తి కావడం గగనమై పోయింది. ఇప్పటిదాకా పూర్తిస్థాయిలో సుమారు 35 వేల ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. కాంట్రాక్టర్‌తో నిర్మిస్తున్న ఇళ్లు పూర్తిగా నిలచిపోయాయి. జిల్లాలో 11 వేల ఇళ్లు ఆ కేటగిరిలోనే ఉన్నాయి. జిల్లాలో గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లలో ఇంకా 37వేల ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.2.50లక్షల మేర రాయితీని పెంచారు. లబ్ధిదారులను గుర్తించారు. మొత్తంపైన రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 92.00 కోట్లు అదనంగా రాయితీ ఇవ్వడానికి ముందుకొచ్చింది. ఈ సారైనా ఎంత వరకు ఇళ్ల నిర్మాణం చేపడతారనేది వేచి చూడాలి.

భీమవరంటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణానికి సంబంధించి పరిశీలన చేస్తే దాదాపు 70 ఎకరాలకు సంబంధించిన స్థలాల్లో పూడిక చేయకపోవడంతో లబ్ధిదారులకు నేటికి స్థలం కేటాయింపు జరగలేదు. దాదాపు 3,958 మంది లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారు. ఇప్పుడా స్థలాల్లో మొక్కలు మొలిచాయి.

గునుపూడి లే-అవుట్

యనమదుర్రు లాకుల సమీపంలో దాదాపు 60 ఎకరాల 85 సెంట్ల స్థలాన్ని అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసింది. స్థల పూడిక కాకపోవడంతో దాదాపు 3,449 మంది లబ్ధిదారులకు సెంటు స్థలం కోసం ఎదురుచూస్తున్నారు.

భారతీయ విద్యాభవన్స్ వద్ద..

భారతీయ విద్యాభవన్స్ సమీపంలో పట్టణంలోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలం కోసం 9 ఎకరాల 70 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. అందులో 509 మందికి పట్టాలు ఇచ్చారు. ఈ స్థలం పట్టణానికి దాదాపు పది కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడ కూడా స్థల పూడిక జరగలేదు.

విస్సాకోడేరు లే-అవుట్ వద్ద

విస్సాకోడేరు లాకుల వద్ద మునిసిపాల్టీ పంపుల చెరువు గట్టును అనుకుని 108 ఎకరాల 86 సెంట్లలో లే-అవుట్ వేశారు. దాదాపు 4,786 మందికి పట్టాలు ఇవ్వాలని నిర్ణయించినా 4,391 మందికి పట్టాలు ఇచ్చారు. ఇక్కడ 2,879 ఇళ్ల నిర్మాణం ప్రారంభమై దాదాపు ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు నిర్మాణాలు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇప్పటివరకు 85 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.

658కి 106 గృహాల నిర్మాణం

భీమవరం రూరల్ : భీమవరం మండలంలో 21 గ్రామాల్లో 33 జగనన్న లే-అవుట్లు ఏర్పాటు చేశారు. అన్ని లే అవుట్లలో మట్టిపూడిక సరిగా జరగలేదు. 658 ఇళ్లల్లో 106 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకున్నారు. తుందుర్రు గ్రామం, కొమరాడ గ్రామాల్లో జగనన్న లే-అవుట్లలో ఒక్కో గృహం కూడా నిర్మాణం చేయలేదు.

శ్మశానం పక్కనే పేదల స్థలాలు

తణుకు రూరల్ : తణుకు మండలంలో మొత్తం తొమ్మిది గ్రామాల్లో పేదల ఇళ్ల **(మిగతా 8వ పేజీలో..)**



తాళ్ళకోడు లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లు

మౌలిక వసతులు నిల్

ఆకివీడు రూరల్ : ఆకివీడు మండలంలో 24 లేఅవుట్లలో ప్రధానంగా కుప్పనపూడి పంచాయతీలో ఉన్న తాళ్ళకోడు లే అవుట్ జిల్లాలోనే అతిపెద్ద లేఅవుట్లలో ఒకటి. చెరుకు మిల్లి, అయిభీమవరం గ్రామాలలో లేఅవుట్లు ఉన్నాయి. తాళ్ళకోడు లేఅవుట్‌లో 3,273 స్థలాలకు గాను 1,570 నిర్మాణ దశలో ఉన్నాయి, 1,603 ఖాళీగా ఉన్నాయి. రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. చెరుకుమిల్లిలో 71 గాను 50 నిర్మాణదశలో, 21 ప్రారంభమవ్వలేదు, అయిభీమవరంలో 98గాను 12 నిర్మాణ దశ, 76 ప్రాంభమవ్వలేదు.



ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాని కాపవరం లేఅవుట్

పేరుకే ఇళ్ల స్థలాలు

తణుకు : వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన నివాసిత స్థలాలు ఏ మాత్రం ఇల్లు కట్టుకునేందుకు వీలు కాని చోట్ల కేటాయించారు. కాపవరం గ్రామ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి ఏమాత్రం అనవుగా లేకపోవడంతో పాటు కనీసం రహదారి సౌకర్యం లేదు. లేఅవుట్‌కు వెళ్లాలంటే ఇల్లిందలపర్రు మీదుగా వెళ్లాలి. లేదా కాపవరం వెళ్లి స్థలాలకు వెళ్లాలి. పట్టణంలోని పలు చోట్ల కేటాయించిన లే-అవుట్లలో నిర్మాణాలు సగం కూడా చేయలేకపోయారు. అజ్జరం లేఅవుట్‌లో 3,374 లబ్ధిదారులకు గాను 1220మంది నిర్మాణాలు చేశారు. పైడిపర్రులో 2,118 మందికి 2,160 మంది నిర్మించుకున్నారు. డీఎల్‌కే రోడ్డులో 97 మందికి 22 మంది నిర్మించుకున్నారు. కొండాలమ్మ పుంతరోడ్డులో 117మందికి 97మంది, కాపవరంలో 1350 మందికి ఒక్కరూ నిర్మాణం చేపట్టలేదు.

అనువుగా లేదు : పెచ్చెట్టి భవాని



ఏమాత్రం అనువుగా లేని చోట స్థలాలు కేటాయించారు. కాపవరం లేఅవుట్‌లో కనీసం రవాణా సౌకర్యం లేదు. అక్కడ ఇళ్లు నిర్మించుకోవాలని చెబితే ఏమాత్రం సాధ్యం కాకపోవడం వల్ల నిర్మించలేదు.

కేటాయింపులో అన్యాయం : పిట్ల విజయలక్ష్మి



స్థలాల కేటాయింపులో లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఒక ప్రాంతంలో ఉన్న వారికి మరో ప్రాంతంలో స్థలాలు కేటాయించారు. చెప్పినా అప్పటి ప్రజాప్రతినిదులు పట్టించుకోలేదు.

మరో చోట కేటాయించాలి : రెల్లి బాలాజీ



కాపవరం లేఅవుట్ లబ్ధిదారులకు అందరికి మరో చోట స్థలాలు కేటాయించాలి. కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం.

నివాసయోగ్యంగా లేదు ? : ఎ.కృష్ణవేణి



ఒక వార్డులో నివసించే అందరికి సమీపంలో లేఅవుట్‌లో కేటాయంపులు చేయలేదు. దీనివల్ల ఎక్కడో ఉన్న కాపవరం లే-అవుట్‌లో స్థలాలు అందించారు. అది కూడా నివాస యోగ్యంగా లేకపోవడంతో ఇల్లు కట్టులేకపోయాం.

మూడు లే-అవుట్లలో ఇళ్లు నిల్

ఆచంట : ఆచంట మండలంలో 37 లేఅవుట్‌లకు గాను 1,437 మంది లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. 350 మంది మాత్రమే నిర్మాణాలు చేపట్టారు. కొన్ని లేఅవుట్‌లలో కనీసం ఒక ఇల్లు కూడా నిర్మించని లే-అవుట్‌లు ఉన్నాయి. వాటిలో పెదమల్లంలంక, చిన మల్లం, కరుగోరుమిల్లిలో ఒక్కొక్క లే-అవుట్, వల్లూరులో మూడు లే అవుట్‌లలో కనీసం ఒక ఇల్లూ నిర్మించలేదు. మిగతా లే-అవుట్‌లలో కొన్నిచోట్ల మూడు, నాలుగు ఇళ్లు మాత్రమే నిర్మించారు.



వల్లూరులో ఒక ఇల్లు కూడా నిర్మించని జగనన్న లేఅవుట్

అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు

పెంటపాడు : జగనన్న కాలనీలు చాలా చోట్ల అసంపూర్తిగా దర్శన మిస్తున్నాయి. చాలా గ్రామాల్లో ఫౌండేషన్ పరిధిలోనే నిర్మాణాలు నిలిపివేశారు. వీటిలో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తుంది. మరి కొన్ని గ్రామాల్లో ఆసలు నిర్మాణాలే ప్రారంభించలేదు. పెంటపాడు, జట్లపాలెం, వలూరుపల్లి గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికి ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. ఈ స్థలాలపై స్థానికులు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో ఇప్పటికీ స్థలాలు రాలేదు. రాచర్లకు చెందిన లబ్ధిదారులకు ప్రత్తిపాడులో స్థలాలు కేటాయించారు.



బిళ్లగుంటలో పౌండేషన్‌తోనే ఆగిపోయిన ఇళ్లు

4 వేలకు కట్టినవి 600 మాత్రమే

నరసాపురం రూరల్ : రుస్తుంబాద పంచాయతీ పరిధిలో మంగళగుంటపాలెం వద్ద ఆరేళ్ల క్రితం 90 ఎకరాలు సేకరించారు. పట్టణ పరిధిలోని 4200 మందికి ఇళ్ల పట్టాలిచ్చి ఇంకా పూర్తిగా పూడ్చలేదు, ఈ కారణంగా ఇప్పటివరకు 600మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వాటిలో 400ఇళ్లు పూర్తయ్యాయి. వైఎస్‌పాలెం పంచాయతీ పరిధిలో 40 మందికి ఇళ్లపట్టాలిచ్చారు. కాలనీలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో ఒక్క నిర్మాణం జరగలేదు.



రుస్తుంబాదలో జగనన్న కాలనీ



యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో నినాదాలు చేస్తున్న కూటమి శ్రేణులు

యలమంచిలి, అత్తిలి ఎంపీపీల ఎన్నిక వాయిదా

- ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఎన్నిక వాయిదా వేయాలని కోరిన కూటమి ఎంపీటీసీ సభ్యులు
- యలమంచిలి ఎన్నికల ప్రిసైడింగ్ అధికారికి అస్వస్థత.. చికిత్స అందించిన వైద్యులు

యలమంచిలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి):యలమంచిలి ఎంపీపీ ఎన్నిక గురువారంతోపాటు శుక్రవారం కూడా మళ్లీ వాయిదా పడింది. ఈ ఎన్నికకు 16 మంది ఎంపీటీసీలు హాజరు కాగా గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్న మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు హాజరు కాలేదు. కూటమి ఎంపీటీసీ సభ్యులు తమకు 'రూ.10లక్షలు ఇస్తామని వైసీపీ అభ్యర్థికి ఓటు వేయాలని లేదంటే మీరు బయట ఎలా తిరుగుతారో చూస్తాం' అని తమకు మళ్లి బెదిరింపు కాల్స్ వచ్చాయని ఎన్నికను వాయిదా వేయాలని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఎం.శ్రీనివాసరావును కోరారు. 12 మంది సభ్యుల స్పష్టమైన మెజారిటీ ఉందని ఎన్నిక నిర్వహించాలని వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ఎన్నికల అధికారిని కోరారు. ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో ఎన్నికల అధికారి తనకు చాతీలో నొప్పి వస్తుందని అస్వస్థతకు గురికావడంతో ఆయనను సమావేశ మందిరం నుంచి ఎంపీపీ కార్యాలయానికి తీసుకెళ్లి వైద్యులు చికిత్స అందించారు. ఈలోగా ఎన్నికల సమావేశానికి వెళ్లిన ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసును బయటకు రప్పించాలని డిమాండ్ చేస్తూ కార్యాలయ ఆవరణలో ఎన్డీయే కూటమి శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. అనంతరం ఎన్డీయే కూటమి ఎంపీటీసీ సభ్యులు జిల్లెళ్ల రత్నంరాజు, కవురు నాగలక్ష్మి, చిలుకూరి రాజ్యలక్ష్మి, ఇంటి సూర్యారావు ఎన్నిక సమావేశం నుంచి బయటకు వచ్చి ఎన్నిక వాయిదా వేశారని తెలిపారు. కూటమి ఎంపీటీసీ సభ్యుడు జల్లెళ్ల రత్నంరాజు మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన తనపై వైసీపీకి చెందిన నార్నిమెరక ఎంపీటీసీ సభ్యుడు తనను అవహేళన చేసేలా ప్రవర్తించాడని, తక్షణమే క్షమాపణ చెప్పకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు మాట్లాడుతూ పన్నెండు మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ ఎన్నికకు హాజరైనప్పటికీ మరోసారి వాయిదా వేయడం అప్రజాస్వామికమన్నారు.

- **అత్తిలి :** అత్తిలి ఎంపీపీ ఎన్నిక రెండోరోజూ శుక్రవారం కూడా వాయిదా పడింది. ఒక్క ఎంపీటీసీ కూడా హాజరుకాకపోవడంతో ప్రత్యేకాధికారి సమావేశాన్ని ముగించారు. మొత్తం 20 మంది ఎంపీటీసీ సభ్యులుండగా అత్తిలి మండల పరిషత్‌లో వైసీపీ -14, టీడీపీ-3, జనసేన-2, ఒక ఎంపీటీసీ విదేశాల్లో ఉన్నారు. అత్తిలిలో వైసీపీ ఎంపీటీసీ సభ్యులతో కలిసి మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు మాట్లాడుతూ పోలీసులు ఖాకీ దుస్తులు వదిలి పచ్చచొక్కాలు వేసుకోవాలని విమర్శించారు. తన ఇంటిపైకి కూటమి మూకలు దాడికి పాల్పడితే ఒక్క పోలీసు కూడా స్పందించలేదని, డీజీపీ, డీఐజీ, ఎస్పీలకు ఫోన్ చేసినా స్పందించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు.

మందు కొనాల్సిందే..!

మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ టార్గెట్లు

- రూ.150 కోట్ల సరుకు విక్రయానికి కసరత్తు
- అధికారుల ఒత్తిడితో వ్యాపారుల ఉక్కిరిబిక్కిరి
- అప్పుల వేటలో లైసెన్స్‌దారులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి):
ప్రైవేట్ మద్యం విధానంతో లాభాలు దండుకోవచ్చంటూ ఆశ పడ్డ లైసెన్స్‌దారులు ఇప్పుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పటివరకు కమీషన్ పూర్తిస్థాయిలో రావడం లేదంటూ ఆందోళన చెందారు. ప్రభుత్వం 14 శాతం కమీషన్ వచ్చేలా ఏర్పాట్లు చేసింది. కాస్త ఊరట చెందారు. అంతలోనే మళ్లీ టార్గెట్‌లు ఇచ్చింది. గతంలో బార్‌లు, ప్రభుత్వ మద్యంషాపుల్లో నెలవారీ అమ్మకాలు రూ.100 కోట్లకు చేరుకోవడం కష్టమయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ మద్యం విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ధరలను తగ్గించింది. వినియోగం పెరిగింది. కానీ టర్నోవర్ రూపంలో పెరగడం లేదు. గత ప్రభుత్వం మాదిరిగానే టర్నోవర్ సాధిస్తున్నారు. మూడు శాతం మాత్రమే టర్నోవర్‌లో పెరుగుదల కనిపించింది. అంటే సగటున రూ.103 కోట్ల మేర అమ్మకాలు సాగుతున్నాయి. మార్చి నెల కావడంతో ఎక్సైజ్ శాఖ టార్గెట్‌లు విధించింది. జిల్లాలో రూ.150కోట్ల మేర కొనుగోలు చేయాలని లైసెన్స్‌దారులకు దిశానిర్దేశం చేసింది. వారంతా అప్పులు చేసుకుంటు న్నారు. నిల్వ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అప్పు చేసి నిల్వలకు ప్రయత్నాలు

ఇప్పటివరకు అమ్మకాలను బట్టి డిపోలనుంచి మద్యాన్ని దిగుమతి చేసుకునేవారు. తాజాగా అదనపు నిల్వల కోసం కుస్తీ పడుతున్నారు. అప్పులు చేసుకుని నిల్వ పెట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇటీవలే లైసెన్స్ ఫీజును చెల్లించారు. వచ్చిన కమీషన్‌లోనే ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటిదాకా లాభాలు చూడని వ్యాపారులు అప్పులు చేసి లైసెన్స్ ఫీజు వాయిదాను చెల్లిస్తున్నారు. షాపులను దక్కించుకోవడానికి సగటున రూ.45లక్షలు మేర వెచ్చించారు. అదే ఇప్పుడు లైసెన్స్‌దారులకు గుదిబండగా మారింది. కమీషన్ రూపంలో పెద్దగా లాభాలు రావడం లేదంటూ ఆందోళన చెందారు. గతంలో 10 శాతం ఉన్న కమీషన్‌ను 14 శాతం వరకు పెంచింది. అయినా పెట్టుబడి వ్యయం అధికం కావడంతో గిట్టుబాటు కావడం లేదు. మార్చి నెలాఖరుకు టార్గెట్‌లు ఇవ్వడంతో ఆపసోపాలు పడుతున్నారు. జిల్లాలోని 175 షాపుల యజమానులు అప్పులకోసం తిరుగుతున్నారు.



అత్యాశగా మిగిలిన అధిక ధరలు

ఇటీవల కొద్దిరోజులపాటు జిల్లాలో మూడు రకాల బ్రాండ్‌లపై రూ.10 అధికంగా విక్రయాలు సాగించారు. ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేయడంతో మళ్లీ నిలిపివేశారు. అధిక ధరలకు అమ్ముతున్నారని తెలుసుకున్న ప్రజాప్రతినిధులు లైసెన్స్ షాపులపై కన్నేశారు. వారి నుంచి కొంత మొత్తాన్ని తీసుకోవాలని సన్నాహాలు చేసుకున్నారు. అది నెరవేరక ముందే ఎక్సైజ్ శాఖ పట్టుబిగించింది. నిబంధనలు కఠినతరం చేసింది. క్వార్టర్‌పై రూ. 10 అధికంగా విక్రయిస్తున్న బ్రాండ్‌లను ఎంఆర్‌పీలకే అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలా అధిక ధరలు ఆశలు కూడా లైసెన్స్‌దారులకు గల్లంతయ్యాయి. టార్గెట్‌లతో ఇప్పుడు సతమతమవుతున్నారు.

పడకేసిన బార్‌లు

ప్రైవేట్ మద్యం అమ్మకాలతో బార్‌లు పడకేశాయి. మద్యం ప్రియులకు చౌకగా మద్యం లభిస్తోంది. అన్ని రకాల బ్రాండ్‌లు షాపుల్లో లభ్యమవుతున్నాయి. బార్‌లలో వాటిని అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నారు. బార్‌లకు ఎమ్మార్పీ ధరలకే ఎక్సైజ్‌శాఖ మద్యం సరఫరా చేస్తుంది. దానిపైనా క్వార్టర్‌పై రూ.50 అధికంగా విక్రయించు కునే వెసులుబాటు ఉంది. గత ప్రభుత్వంలో షాపుల్లో బ్రాండెడ్ రకాలు లభ్యమయ్యేవి కావు.. నాసిరకం విక్రయించేవారు. బార్‌లలోనే బ్రాండ్‌లు లభించేవి. బార్‌లలో వ్యాపారం జోష్‌గా సాగింది. తాజాగా ప్రైవేట్ మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ధరలకే బ్రాండెడ్ మద్యం లభిస్తోంది. బార్‌లపై మద్యం ప్రియులు ఆసక్తి చూపడం లేదు. షాపుల్లోనే కొనుగోలు చేస్తున్నారు. బార్‌ల నిర్వహణ భారమైపోయింది. టార్గెట్‌ల ఇబ్బందులు బార్ యజమానులను సైతం వెంటాడుతున్నాయి.

బెదిరించి.. ప్రాణం తీశాడు
కారకుడిని శిక్షించాలంటూ బంధువుల ఆందోళన
5
వృద్ధురాలి దారుణ హత్య

నామినేటెడ్‌పై ప్రభుత్వం మరో అడుగు

- తణుకు, తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్లుగా కొండేటి, చాపల



కొండేటి శివ



చాపల మంగాబాయి

భీమవరం-ఆంధ్రజ్యోతి/ తణుకు/ తాడేపల్లిగూడెం రూరల్ : ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీకి అడుగులు వేస్తోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీల భర్తీని చేపట్టింది. తొలి విడతగా రాష్ట్రంలో 47 ఏఎంసీల చైర్మన్‌లను ప్రకటించారు. జిల్లాలో రెండు మార్కెట్ కమిటీలకు అవకాశం దక్కింది. తాడేపల్లిగూడెం జనసేన ఖాతాలో చేరింది. తణుకు ఏఎంసీ తెలుగుదేశానికి దక్కింది. జిల్లాలో పది ఏఎంసీలు ఉన్నాయి. తణుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తణుకు మండలం దువ్వ గ్రామం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొండేటి శివ నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి వెలువడిన జాబితాలో శివ పేరును ఖరారు చేశారు. దీంతో గ్రామంలోని సంబరాలు చేసుకున్నారు. 2013 నుంచి సాధారణ కార్యకర్తతో పార్టీలో చేరి అప్పటినుంచి పార్టీలో క్రియాశీలకంగా శివ వ్యవహరిస్తున్నారు. 2019లో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షు డిగా నియమితులయ్యారు.

- తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్‌గా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చాపల మంగాబాయి నియమితులయ్యారు. జనసేన పార్టీలో పదేళ్ల నుంచి క్రియాశీలంగా ఉంటున్న చాపల రమేష్ భార్యకు ఈ అవకాశం లభించింది. గతంలో వైసీపీ హయాంలో తొలిగా ఓసీ మహిళకు రిజర్వేషన్ డిక్లేర్ కాగా గుండుబోగుల వెంకటరమణ, తరువాత ఎస్సీ జనరల్ కేటగిరిలో ముప్పిడి సంపత్‌కుమార్ చైర్మన్‌లుగా వ్యవహరించారు. తాజాగా జనసేన తరపున చాపల మంగాబాయికి అవకాశం లభించింది. ఆమె మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, యువనేత రాజేష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీకి కృతజ్ఞతలు తెలిపారు.

మంచినీటి కాల్వలే !



ఏలూరు ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేది గోదావరి, కృష్ణ కాల్వల నీరే.. కృష్ణా కాల్వ నుంచి ఏలూరు పంపుల చెరువు నింపుతారు. వాటిని మున్సిపల్ అధికారులు క్లోరిన్, ఫిల్టర్ బెడ్స్ ద్వారా శుద్ధి చేసి తాగునీటిని సరఫరా చేస్తుంటారు. ఈ కాల్వలను ఎప్పుడూ శుభ్రం చేయరు. పిచ్చి మొక్కలు, నాచు, చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, తూడుతో నీళ్లన్నీ దుర్వాసన వెదజల్లుతుంటాయి. నగరంలోని మూడు లక్షల మంది జనాభాకు తాగునీటిని అందించాల్సిన కాల్వల పరిస్థితి ఇలా ఉంటే ఇక నగర ప్రజల ఆరోగ్యం ఏమి కాను.. అందుకే తరచూ నగర ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు..

బిర్లాభవన్ సెంటర్‌కు వెళ్లు బ్రిడ్జి వద్ద కృష్ణ కాలువ దుస్థితి

మెయిల్ బజార్‌కు వెళ్లు వంతెన వద్ద కాలువలో చెత్తా, చెదారం



-ఫొటోగ్రాఫర్, ఏలూరు

1నే టెన్త్ సోషల్ స్టడీస్ పరీక్ష : డీఈవో

ఏలూరు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహణ తేదీపై నెలకొన్న అస్పష్టతను తొలగిస్తూ డీఈవో వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోషల్ స్టడీస్ పరీక్షను ఈ నెల 31న కాకుండా ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు నిర్వహిస్తామని వివరించారు. పరీక్ష తేదీ మార్పును జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు తెలియజేయాలని ఆదేశించారు.



భీమవరంలో ఎండ నుంచి రక్షణకు ఒక వృద్ధురాలు ఇలా..



ముదినేపల్లిలో స్కూలు నుంచి పిల్లలను గొడుగు నీడన ఇంటికి తీసుకు వెళుతున్న తల్లి

ఎండల్లో జాగ్రత్త

లింగపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో మార్చి నెలలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ? ఏ విధమైన వైద్య సేవలు పొందాలనే విషయాలను డాక్టర్ లింగపాలెం మండలం కె.గోకవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.కృష్ణకిషోర్ ఆంధ్రజ్యోతికి వివరించారు.



డాక్టర్ కృష్ణకిషోర్, కే.గోకవరం పీహెచ్‌సీ, లింగపాలెం మండలం

- ఎండ ఎక్కువగా ఉండే సమయంలో అంటే ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట తిరగకూడదు. తప్పని పరిస్థితులలో బయటకు వెళ్లవలసి వస్తే తప్పకుండా తెల్లని దుస్తులు, తలకు టోపీ, రుమాలు కళ్లజోడు ధరించాలి. లేదంటే డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.
- ఎండాకాలంలో శరీరంలో నీటిశాతం తగ్గడం వల్ల శరీరంలో శక్తి తగ్గి డీహైడ్రేషన్‌కు గురవుతారు. ప్రతిరోజూ తప్పకుండా 8 నుంచి 10 గ్లాసులనీరు తాగాలి. తాజా ఆహారాన్ని తీసుకోవాలి. బిర్యానీలు, ఆయిల్‌ఫుడ్స్, మసాలాలతో కూడిన ఆహారం తగ్గించి ఎక్కువగా కొబ్బరినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకుంటే మంచిది.
- శరీరంలో టెంపరేచర్ పెరిగినప్పుడు ఆ వ్యక్తి ఒంటిపై దుస్తులు తీసివేసి ముఖం, శరీర భాగాలను చల్లని నీటితో తుడవాలి. గాలి బాగా తగిలే ప్రదేశంలో ఉంచాలి. లేదంటే ఆ వ్యక్తి వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది.
- జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిల్లో వైద్యులు, మందులు అందుబాటులోనే ఉన్నాయి. ప్రతి గ్రామం లోనూ అంగన్‌వాడీ కేంద్రాలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, దగ్గర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. ఉపాధిహామీ కూలీలకు కూడా వారి పనిచేసే స్థలాలలో కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది .
- గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు హైరిస్క్‌లో ఉంటారు. అలాంటివారు ఎండల్లో తిరగక పోవడమే మంచిది. ఎవరైనా డీహైడ్రేషన్‌కు గురైతే వెంటనే మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మకాయ ఉప్పు కలిపిన నీరు, ఓఆర్ఎస్ ద్రావణం లాంటివి తాగించాలి. చల్లనిగాలి తగిలేలా చూడాలి.

వడదెబ్బ లక్షణాలు..జాగ్రత్తలు

పోలవరం (ఆంధ్రజ్యోతి) : తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం రావడం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, లేదా పూర్తి అపస్మారక స్థితి కలిగి ఉండడం వంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తిం చాలి. వడదెబ్బకు గురి అయిన వారిని నీడగా ఉన్న చల్లటి ప్రాంతానికి వెంటనే చేర్చాలి. శరీరంలో ఉన్న అదనపు ఉష్ణాన్ని నియంత్రించాలి. చల్లని బట్టతో తుడుస్తూ ఉండాలి. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకపోతే వారిని శీతల వాతావరణంలో దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి. వీలైనంత ఎక్కువ నీరు తాగించాలి. ఇంటినుంచి బయటకు వెళ్ళే ముందు అవసరమైనంత మంచినీరు తాగాలి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు, మజ్జిగ , మంచి నీరు లాంటివి తాగాలి. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్ళినప్పుడు తల తిరుగుడు మొదలైన అనారోగ్య సమస్యలు ఏర్పడితే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొంది వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. నలుపు రంగు దుస్తులు మందంగా ఉండేవి ధరించ కూడదు. బయటకు వెళ్ళేటప్పుడు వెంట మంచినీళ్ల బాటిల్, గొడుగు, చెవులు కప్పుకునేలా రుమాలు వంటివి తీసుకెళ్లడం మంచిది.

భీమవరం రైల్వేస్టేషన్ ఇక కొత్తగా..

రూ. 32 కోట్లతో అభివృద్ధి

భీమవరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణం కొత్త శోభ సంతరించుకోబోతున్నన్నది. ఆక్వా, విద్య, వైద్య రంగాల్లో పెట్టింది పేరుగా ఉన్న భీమవరం పట్టణానికి రవాణా కూడా ఎంతో ప్రతిష్టాత్మ కంగా జరుగుతుంది. నిడదవోలు టు గుడివాడ, భీమవరం టు నరసాపురం, గుడివాడ నుంచి విజయవాడ, గుడివాడ - మచిలీపట్నం డబ్లింగ్ రైల్వే లైన్ పనులు పూర్తయినప్పటి నుంచి కొత్త రైళ్లు పెరిగాయి. అలాగే రవాణాకు ఉపయోగించే గూడ్స్ రైళ్ళు కూడా భారీగా పెరగడంతో రైల్వే శాఖ కొత్త పుంతలు తొక్కనుంది. దీనిలో భాగంగానే అమృత్ భారత్ రైల్వే స్టేషన్స్‌లను కేంద్రం ఎంపిక చేసింది. దానిలో భాగంగా జిల్లాలోని నరసాపురం, భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లు ఎంపికయ్యాయి. కొత్తగా స్టేషన్లను పునర్ నిర్మించడం కోసం భీమవరం టౌన్ స్టేషన్‌కు రూ. 32.37 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 55 శాతం పనులు పూర్తయినట్లు రైల్వే శాఖ అధికారులు చెబుతున్నారు. రోజుకు సగటున భీమవరం టౌన్ స్టేషన్‌కు 7,587 మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఏడాదికి టౌన్ రైల్వేస్టేషన్‌కు రూ. 33.20 కోట్లు ఆదాయం వస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. కొత్త టెక్నాలజీతో రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే ఇంకా ప్రయాణికుల సంఖ్యతో పాటు రైళ్ల రాకపోకలు కూడా పెరిగే అవకాశం ఉన్నట్లుగా కొందరు ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికే అంబేడ్కర్ సెంటర్ నుంచి డీ మార్ట్ వరకు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పూర్తవడంతో పట్టణానికి కొంత కొత్త శోభ కనబడుతుంది. అలాగే ఉండి రోడ్డులోని రైల్వే గేటు వద్ద కూడా అండర్ టన్నెల్ కానీ, ఆర్‌వోబీ గాని నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఏదేమైనా రాబోయే రోజుల్లో భీమవరాన్ని కొత్త శోభతో చూడబోతున్నాం.



భీమవరం కొత్త రైల్వేస్టేషన్ నమూనా



ప్రస్తుత రైల్వేస్టేషన్ భవనం



విద్యుత్ దీపాలతో వెలుగొందుతున్న ఉగాది మండప పరిసరాలు

విద్యుద్దీప కాంతుల్లో ఉగాది మండపం

ద్వారకాతిరుమల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఉగాది ఉత్సవానికి మండపాన్ని విద్యుత్ దీప తోరణాలతో అలంకరించారు. శ్రీవారు, పద్మావతి అమ్మవారి భారీ కటౌట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆదివారం సాయంత్రం స్వామివారు, ఉభయ దేవేరులతో కలసి వెండి శేషవాహనంపై ముందుగా తిరువీధుల్లో విహరిస్తారు. అనం తరం ఉగాది మండపానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీరుతారు. అర్చ కులు పండితులు పంచాంగ శ్రవణం చేస్తారు. తరువాత దాతలకు, పండితులకు సత్కార కార్యక్రమం ఉంటుందని భక్తులు తరలిరావాలని ఈవో ఎన్వీ సత్యన్నా రాయణమూర్తి కోరారు.

కోండ్రుకోట పునరావాస కాలనీలో దుర్గాదేవి జాతర



పోలవరం మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం ఎల్లండీపేట సమీపంలో ఉన్న కోండ్రుకోట పునరావాస కాలనీలో శుక్ర వారం మూడు వందల ఏళ్ల చరిత్ర కలిగిన కనక దుర్గమ్మ జాతర పనులు గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్ కుమార్ మాట్లా డుతూ కోండ్రుకోట పాత గ్రామంలో 300 సంవత్సరాల వయసు కలిగిన పాశి వృక్షం కింద మూడు వందల సంవత్సరాల క్రితం గిరిజన ఆదివాసి పెద్దలు ప్రతిష్ఠించి పూజాధికాలు నిర్వహించేవారన్నారు. ప్రతిఏటా జాతర నిర్వహించేవారన్నారు. అదే విగ్రహాలతో పునరావాస గ్రామంలో నిర్మించిన ఆలయం వద్ద శని ఆది వారాలలో జాతర నిర్వహించనున్నామని,ఇక్కడకు వచ్చిన మూడేళ్ల తర్వాత తొలిసారిగా జాతర నిర్వహిస్తున్నామని కోండ్రుకోట గ్రామ పరిధి గ్రామాలన్నీ పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ప్రదర్శనకు వచ్చిన లేగ దూడలను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

తక్కెళ్లపాడులో లేగ దూడల ప్రదర్శన

ద్వారకాతిరుమల, మార్చి28 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులు లేగదూడల పోషణలో మెళకువలను పాటించడంతో పాటు శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సాయిరమేష్ అన్నారు. ద్వారకా తిరుమల మండలంలోని తక్కెళ్లపాడులో శుక్ర వారం పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభి వృద్ధి సంస్థల ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన జరిగింది. ఇందులో 25 గేదె దూడలు, 15 హైబడి ఆవుదూడలను రైతులు తీసుకొచ్చారు. 30 దూడలకు బ్రూసెల్లా టీకాలను వేశారు. అనంతరం పశుపోషణ, జాతి లక్షణాలు ఆధారంగా రైతులకు బహుమతులను అందించారు. పాల్గొన్న ప్రతీ రైతుకు కాల్షియం, లివర్ టానిక్, గోమర్లు మందు, స్టీల్ క్యాన్‌లను బహు మతిగా అందజేశారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, డాక్టర్ హరి కృష్ణ, పాడిరైతులు బి.సూర్యనారాయణరెడ్డి, మానికల రామకృష్ణ, ముల్లంగి కృష్ణారెడ్డి, షేక్ మస్తాన్ సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు బహుమతులు అందజేస్తున్న పశుసంవర్ధక అధికారులు

అయోమయంలో జామాయిల్ రైతు

అంతకంతకు తగ్గుతున్న ధర

టన్ను రూ.7,800 నుంచి రూ.6,500కి పతనం

కుక్కునూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో విస్తారంగా సాగవుతున్న జామాయిల్ సాగు రైతాంగానికి నష్టాలు కలిగించే పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం వరకు టన్ను జామాయిల్ ధర రూ.7800 వరకు పలికింది. క్రమక్రమంగా తగ్గుతూ ప్రస్తుతం టన్ను ధర రూ.6500కి పడిపోయింది. జామాయిల్ ధర నిలకడగా లేకపోవడం రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తుంది. జామాయిల్ కొనుగోలు చేసే కంపెనీలు వారి అవసరాలకు అనుగుణంగా ధర పెంచడం అనంతరం తగ్గించడం చేస్తున్నారు. అదే విధంగా కంపెనీలన్నీ సిండికేట్ అయ్యి ధరను తగ్గించేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ధర తగ్గటానికి అటవీశాఖ నుంచి విస్తారంగా జామాయిల్ కర్ర కంపెనీలకు తరలివెళ్లడమే కారణం. దాదాపు 20 ఏళ్ల క్రితం అటవీ శాఖ గ్రామాల్లోని వనసంరక్షణ సమితి (వీఎస్ఎస్) సభ్యులు సంయుక్తంగా జామాయిల్ పంట వేశారు. ఈ ఏడాది అటవీశాఖ ద్వారా పెంచబడిన జామాయిల్‌కు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. దీంతో వేలాది టన్నుల జామాయిల్ కర్ర కంపెనీలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతుల నుంచి విస్తారంగా కొనుగోలు చేసే కర్మాగారాలన్నీ ధరను క్రమక్రమంగా తగ్గించేస్తున్నాయి. దీంతో వెయ్యి నుంచి రూ.1500వరకు టన్ను ధర తగ్గిపోయింది. గత ఏడాది టన్ను జామాయిల్ ధర రూ.5500 ధర పలికింది. ఈ క్రమంలో గత ఆరునెలల నుంచి క్రమక్రమంగా ధర పెరుగుతూ టన్ను రూ.7800కి చేరింది. ప్రతీ ఏటా పత్తి, మిర్చి సాగు చేసిన రైతాంగం నష్టాలను చవిచూడటంతో పెరిగిన జామాయిల్ ధరను చూసి అందరూ ప్రత్యామ్నాయ పంటగా జామాయిల్ పంట వైపు ఆసక్తి కనపరిచారు. దీంతో రైతులు పోటీపడి జామాయిల్ సాగు చేయడానికి ముందుకొచ్చారు. కుక్కునూరు మండలంలో అల్లిగూడెం, పెద్దరావిగూడెం, భువనగిరి ప్రాంతాల్లో పెంపకం సాగుతున్న జామాయిల్ నర్సరీల నుంచి దాదాపు 15 కోట్ల మొక్కలను రైతాంగం కొనుగోలు చేసి అన్ని ప్రాంతాల్లో విస్తారంగా సాగు చేపట్టారు. ఎన్నో ఆశలతో జామాయిల్ సాగు ఆరంభిస్తే క్రమక్రమంగా ధర తగ్గటం రైతాంగంలో ఆందోళన నెలకొంది. ఎన్నో ఆశలతో లాభాలు గడించవచ్చని



రైతులు ఎకరం జామాయిల్ సాగు చేయడానికి రూ.10 వేలకు పైగా కౌలుకు తీసుకుని మరీ సాగు ఆరంభించారు. ధర ఎక్కువగా ఉంటేనే రైతుకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి ఉంది. కానీ ధర తగ్గితే రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. పత్తి, మిర్చి పంటతో నష్టపోతున్న రైతాంగం ఎన్నో ఆశలతో జామాయిల్ సాగు వైపు దృష్టి పెట్టగా ఇప్పుడు ధర కూడా పతనం కావడంతో ఏం చేయాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు.

కోర్టు సిబ్బందికి పదోన్నతులు, బదిలీలు

ఏలూరు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ కోర్టులలో పని చేస్తున్న 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎం.సునీల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారికి వివిధ కోర్టులలో పోస్టింగులు కల్పించారు. మరో 15 మంది వివిధ కోర్టుల సూపరింటెండెంట్లుగా బదిలీలు చేశారు. పదోన్నతి పొందిన వారిలో ఎస్.మల్లేశ్వర గుప్తా, జీపీ హెప్సిబా, పి.భాస్కరరావు, ఎన్.పట్టాభి రామ రాజు, ముక్కు శ్రీనివాసరావు, కె.గంగ రాజు, ఎం.ధర్మారావు, ఎస్.శివగిరి, పి.గురివినాయుడు, కె.రాజ్యలక్ష్మి ప్రభ, జి.శిరీషలు ఉన్నారు.



ముచ్చటగొలిపే మట్టిపాత్రలు

జాతీయ రహదారిపై రాజస్థాన్ వాసుల అమ్మకాలు

పాత రోజులు మళ్లీ వస్తున్నాయి. జనం మట్టి పాత్రలపై మోజు పడుతున్నారు.. ఆరోగ్యరీత్యా అల్యూమినిం పాత్రల నుంచి దూరం జరుగుతూ మట్టితో చేసిన కుండలు, కడాయిల వైపు చూస్తున్నారు. రాజస్థాన్ నుంచి వలస వచ్చిన ఓ కుటుంబం ప్రత్యేకమైన మట్టితో తయారు చేసిన పాత్రలు, నీళ్లసీసాలు, కడాయిలను జాతీయ రహదారిపై అమ్మకాలు సాగిస్తున్నారు. వాహనాలపై సామాగ్రి వేసుకుని జాగా దొరికిన చోట దుకాణం పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. రోజూ రెండు నుంచి మూడు వేల వరకూ అమ్మకాలు సాగిస్తున్నామని మట్టి పాత్రలకు మంచి ఆదరణ లభిస్తుందని వారు చెబుతున్నారు. మట్టి పాత్రలతో పాటుగా చిన్న పిల్లలను ఆకర్షించేలా కారు బొమ్మలు, కుర్చీలు, స్టడీ, ల్యాప్‌టాప్ టేబుళ్లను అమ్ముతున్నారు.. పెదపాడు మండలం కలపర్రు జాతీయ రహదారిపై విక్రయిస్తున్న దృశ్యం

-పెదపాడు (ఆంధ్రజ్యోతి)





గేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఏపీ నిట్ ప్రొఫెసర్లు

నిట్ నుంచి గేట్

జాతీయ స్థాయి ర్యాంకులతో సత్తా చాటిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ఫలితాలలో తాడేపల్లిగూడెం ఏపీ నిట్ విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించారు. జాతీయ స్థాయి ర్యాంకులతో సత్తా చాటారు. బీటెక్ విద్యార్థులు కె.నవ్య (బయోటెక్నాలజీ) 8వ ర్యాంకు, సీహెచ్.దినేష్ (ఈసీఈ) 23వ ర్యాంకు, డి.వర్ధన్ (ఎలక్ట్రికల్) 40వ ర్యాంకు, శ్రీధర్ వర్మ కలిదిండి (సీఎస్ఈ) 56వ ర్యాంకు, కె.కళాతులసి(బయో ఇన్ఫర్మేటివ్ ఇంజనీరింగ్) 102వ ర్యాంకు, అతిధి అనన్య (ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్) 164 వ ర్యాంకు సాధించారు. నలుగురు 100లోపు ర్యాంక్‌లు సాధించగా, 10 మంది 500లోపు, 12 మంది వెయ్యిలోపు ర్యాంకులు సాధించారు. ఏపీ నిట్‌లో విద్యార్థులకు ప్రతీ సంవత్సరం గేట్ రాయడానికి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ మంచి ర్యాంకులు సాధించడానికి దోహదపడిందని విద్యార్థులు తెలిపారు. ఇంజనీరింగ్ తరువాత ఎంటెక్‌లో చేరి ఉన్నత విద్యనభ్యసించడంతో పాటు కొన్ని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో కొలువుల సాధనకు గేట్ ర్యాంకులను ప్రామాణికం. దీంతో ఏపీ నిట్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు సాధించిన విజయం సంస్థకు ఎంతో గర్వకారణమని ఆచార్యులు చెబుతున్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరాం, గేట్ ఉచిత శిక్షణ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వినోద్‌కుమార్‌రాజా తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి

మాది విజయవాడ. మా నాన్న కె.శ్రీనివాసరావు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. మా అమ్మ సుధారాణి గృహిణి. నేను ఏపీ నిట్‌లో బయోటెక్నాలజీ చదువుతున్నాను. గేట్‌లో 8వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది. మా సంస్థలో గేట్ ఉచిత శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగపడింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించా లనేది నా లక్ష్యం. - **కె.నవ్య, బయోటెక్నాలజీ**



విదేశాల్లో ఉన్నత చదువుకు వెళతా

మాది విశాఖపట్నం. ఏపీ నిట్‌లో ఈసీఈ చదువుతున్నాను. నాన్న హరి శివప్రసాద్, అమ్మ సుజాత. గేట్ పరీక్షలో 23వ ర్యాంకు సాధించడం చాలా ఆనందంగా ఉంది. నిట్‌లో ఆచార్యులు మా చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. కాబట్టే మేము చదువులో ఇలా రాణిస్తున్నాం. విదేశాలకు వెళ్లి ఉన్నత చదువులు చదవాలనేది నా కోరిక. **- సీహెచ్ దినేష్, ఈసీఈ**



ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ లక్ష్యం

మాది వరంగల్. మా నాన్న కుమారస్వామి సివిల్ ఇంజనీర్. అమ్మ స్వప్న గృహిణి. గేట్‌లో సంస్థ అందిస్తున్న శిక్షణ మా భవిష్యత్‌కు బంగారు బాటలు వేసింది. ప్రశ్నలు ఎలా వస్తాయి, జవాబులు ఎలా రాయాలనే దానిపై మంచి శిక్షణ ఇచ్చారు. నేను గేట్‌లో 40వ ర్యాంకు సాధించగలిగాను. భవిష్యత్‌లో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో స్థిరపడాలనేని నా లక్ష్యం. **- డి.వర్ధన్, ఎలక్ట్రికల్**

కదలి వచ్చిన అధికారులు

మొగల్తూరు, పెనుగొండలో గ్రామాభివృద్ధి సభలు నిర్వహించిన డిప్యూటీ సీఎం పేషీ అధికారులు

మొగల్తూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు గ్రామ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ తెలిపారు. గ్రామ సర్పంచ్ పడవల మేరీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన గ్రామాభివృద్ధి సభలో కృష్ణ తేజ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొగల్తూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. తమను మొగల్తూరులో గ్రామసభ నిర్వహించి అభివృద్ధిపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారన్నారు. ప్రజలు మన వద్దకు రావడం కాదు, మనమే వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని చెప్పడంతో గ్రామ సభ ఏర్పాటు చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన అవకాశాన్ని గ్రామస్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.



అభివృద్ధికి దూరంగా ఉన్నాం

ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. సముద్ర తీరం కావడంతో ప్రజల దాహార్తి తీరాలంటే కాలువ నీరు మాత్రమే ఆధారమని, భూమి నుంచి మంచినీరు లభ్యం కాదన్నారు. ఉప్పునీటి ప్రాంతం కావడం, ఒక పక్క సముద్రం, మరోపక్క గోదావరి, ఉప్పుటేరుల మధ్య జీవనం కొనసాగిస్తున్నామన్నారు. మొగల్తూరులో తాగునీరు, సాగునీరు, విద్య, వైద్య, రహదారి సదుపాయాలు కల్పనకు పవన్ సిద్ధంగా ఉన్నారన్నారు.

ఏమి కావాలో చెప్పండి అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను పంపించారని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. గ్రామస్తులు సూచించిన పనులకు ప్రతిపాదనలు రూపొందించి త్వరితగతిన పరిష్కారం చేస్తారన్నారు. విజ్జేశ్వరం నుంచి మంచినీటి ప్రాజెక్టులకు నేరుగా పైప్‌లైన్ ద్వారా నీరందించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు కోరారు. మాజీ సర్పంచ్‌లు మామిడిశెట్టి సత్యనారాయణ, శ్రీరాజా కలిదిండి కుమార్ బాబు, పడవల సత్యనారాయణ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, గ్రామస్థులు, సమీప గ్రామాల సర్పంచ్‌లు, రైతులు సమస్యలపై వినతులు అందించారు. పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, డీపీవో అరుణశ్రీ, డీసీఎం పేషీ అధికారులు ఓఎస్‌డీ కె.వెంకటకృష్ణ, జీఆర్ మధుసూదన్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ, మార్చి28(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు మేరకు పెనుగొండలో నిర్వహించిన గ్రామాభివృద్ధి సభలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు సమస్యలు ఏకరువు పెట్టారు. పవన్ కల్యాణ్ తండ్రి వెంకట్రావు స్వగ్రామం కావడంతో అభివృద్ధిపై ప్రతిపాదనలకు డీసీఎం పేషీ అధికారులను పంపించారు. టీటీడీ కల్యాణ మండపంలో వినతిపత్రాలు స్వీకరించారు.

తొలి పారిశ్రామిక పట్టణంగా పెనుగొండకు ఖ్యాతి ఉందని, పెనుగొండలో ఇనుము ఫ్యాక్టరీ ఉన్న కాలంలో సుమారు 500 మంది కార్మికులు పని చేసేవారన్నారు. పెనుగొండను పారిశ్రామిక పట్టణంగా తీర్చిదిద్దాలని కోరారు.

- పారిశుధ్యం మెరుగుదల, భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి సహకరించాలని గ్రామస్థులు కోరారు.
- పెనుగొండ కళాశాల వద్ద కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.
- పెనుగొండ - మార్టేరు కాలువగట్టు రహదారి అభివృద్ధి చేయాలని, బీడు, రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు.



మొగల్తూరు గ్రామాభివృద్ధి సభలో మాట్లాడుతున్న పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ



పెనుగొండ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

- సిద్ధాంతంలో పవిత్ర వశిష్ఠ నదీ తీరంలో కైలాస భూమి అభివృద్ధి చేయాలని, పెనుగొండలో శ్మశాన వాటిక, ఎస్సీ శ్మశాన వాటికల అభివృద్ధి చేయాలని కోరారు.
- ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డుకు రెండున్నర ఎకరాలు కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు.
- పెనుగొండలో ఆధ్యాత్మిక శోభకు అనుగుణంగా గ్రీన్ సిటీగా తీర్చిదిద్ది వాసవి ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు.

నివేదిక తయారుచేసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు నివేదిస్తామని పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. ప్రతీ సమస్య డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలిస్తారని, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అన్ని పనులు జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ హామీ ఇచ్చారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, ఫారెస్ట్ ఎస్‌పీఎఫ్ కృష్ణ, పీఏ.బాలకృష్ణ, తహసీల్దార్ అనితకుమారి, ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పని చేయండి

అధికారుల తీరుపై కేంద్ర మంత్రి అసహనం



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సమన్వయం, చిత్తశుద్ధితో పనిచేస్తే ఏ కార్యక్రమమైనా విజయవంతమవుతుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ (దిశ) సమావేశంలో శుక్రవారం అధికారులతో ఆయన సమీక్షించారు. సమీక్ష సమావేశాలకు కొంతమంది జిల్లా అధికారులు హాజరు కాకపోవడం, కింది స్థాయి అధికారులను పంపడంపై కేంద్ర మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించే సమావేశాలకు జిల్లా స్థాయి హాజరు కాలేని పక్షంలో కలెక్టర్ అనుమతి తీసుకోవాలన్నారు. అధికారులు ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోకుండా ప్రొటోకాల్ ప్రకారం నిబంధన మేరకు పనిచేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా చేపట్టిన పనులు ప్రగతి, ఖర్చు వివరాలపై కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారుల వివరణ కోరారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి జడ్డు వెంకటేశ్వరరావు, సీపీవో కె.శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఈవో ఇ.నారాయణ, జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్

పీఎం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకంలో భీమవరం ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు రూ.23.75 కోట్లు మంజూరయ్యాయని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చేనెలలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. భీమవరంలో క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుకు సహకరించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శ్రీనివాసవర్మ కృతజ్ఞతలు తెలిపారు. అమృత్ భారత్ పథకంలో తాడేపల్లిగూడెం, భీమవరం టౌన్, నరసాపురం రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయించినట్లు ఆయన తెలిపారు. భీమవరం టౌన్ స్టేషన్‌లో రూ.32.37 కోట్లతో చేపట్టిన పనులు 55 శాతం పూర్తయ్యాయన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా సీఎస్ఆర్ నిధులను తీసుకురావడం జరిగిందని, మరిన్ని నిధులను సాధించి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

భార్య మరణం తట్టుకోలేక..

రైలు కిందపడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భార్య మరణాన్ని జీర్ణించుకోలేక ఆమె జ్ఞాపకాలను పదే పదే గుర్తు చేసుకుని కుమిలిపోతూ, తానూ కూడా భార్య వద్దకే వెళ్లిపోవాలని భావించాడు. చివరికి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు లంకపేటకు చెందిన పిల్లి గురుమూర్తి(77) భార్య ఆరేళ్ల క్రితం మరణించింది. ఆమె జ్ఞాపకాలతో బాధపడుతూ శుక్రవారం ఉదయం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫామ్ చివర రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

దెందులూరు,మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో మోటార్ సైక్లిస్ట్ మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దళితవాడకు చెందిన గుంపుల వంశీ, కొల్లబత్తుల ఏసు కూలి డబ్బుల కోసం మోటార్‌సైకిల్‌పై శ్రీరామవరం వెళుతున్నారు. శ్రీరామవరం వైపు నుంచి కూలీలతో వస్తున్న ఆటో మోటార్‌నుసైకిల్‌ను ఢీ కొంది. మోటార్ సైకిల్ వెనుక కుర్చున్న కొల్లబత్తుల ఏసు(35) అక్కడిక్కడే మృతి చెందాడు. మోటార్ సైకిల్ నడుపుతున్న గుంపుల వంశీ తీవ్రగా గాయపడ్డాడు. వంశీని స్థానికులు అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఏసుకు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఏసు మృతదేహాన్ని ఏలూరు ఆసుపత్రికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు అద్దెకు కావాలంటూ..

వృద్ధురాలిపై బ్లేడుతో దాడి

భీమవరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చి వృద్ధురాలిపై ఒక వ్యక్తి బ్లేడుతో దాడి చేశాడు. వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మిరాజు తోటలో నివాసం ఉంటున్న యర్రంశెట్టి మంగతాయారు ఇంటికి శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి ఇల్లు అద్దెకు కావాలని వచ్చాడు. దూరపు బంధువును అంటూ ఆమెను నమ్మించాడు. ఇల్లు చూసిన అనంతరం మంగతాయారుపై చైనా బ్లేడుతో దాడి చేశాడు. అనంతరం వృద్ధురాలి మెడలో ఉన్న బంగారాన్ని దోచుకుని పరారయ్యాడు. వృద్ధురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డీఎస్పీ జయసూర్య, సీఐ నాగరాజు, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఘట నాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన..

నిందితుడిపై పోక్సో కేసు

భీమవరం క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రెండో భార్య కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై టూటౌన్ పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఫాజిల్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం రెండవ పట్టణంలోని సత్యవతి నగర్‌లో ఉంటున్న ఒక మహిళ భర్తతో సుమారు పదేళ్ల నుంచి దూరంగా ఉంటుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. అప్పటి నుంచి మరొకరితో ఆమె సహజీవనం చేస్తుంది. మళ్లీ ముగ్గురు పిల్లలు జన్మించారు. ఆ మహిళ బయటకు వెళ్లిన సమయంలో రెండో భర్త కె.గణేష్ మణికంఠ ఆమె మొదటి భర్త కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నాడు. ఆ విషయాన్ని ఆ బాలిక తల్లితో చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

30, 31 తేదీల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయి

2 నుంచి రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

ఏలూరు/ఆచంట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో ఈ నెల 30, 31 సెలవు దినాలు అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్యాలు పూర్తి చేసేందుకు అనువుగా ఈ రెండు రోజులు కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పని చేస్తాయని సంబంధిత శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 వరకు పని చేయనున్నాయి. సెలవు దినాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కక్షిదారులు సద్వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు. దీంతో పాటు ఏప్రిల్ 2 నుంచి రిజిస్ట్రేషన్లు శాఖ స్లాట్ బుకింగ్ విధానంలో రిజిస్ట్రేషన్లు చేయడం జరుగుతుందని ఏలూరు జిలా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు తెలిపారు. నిర్ణీత వేళల్లో స్లాట్ బుకింగ్ సమయంతో పాటు రిజిస్ట్రేషన్లు అతి త్వరగా చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

నరసాపురం నుంచి ప్రత్యేక రైలు

నరసాపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి) నరసాపురం నుంచి యశ్వంత్‌పూర్‌కు సమీప స్టేషన్ యలహంకా మీదుగా కర్ణాటకలోని ఆరిశికరే వరకు ఏప్రిల్, మే నెలల్లో ప్రత్యేక రైలు నడపనున్నారు. ఆయా నెలల్లో ప్రతి ఆదివారం ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు శుక్రవారం తెలిపారు. 07201 నెంబర్‌తో ఆదివారం మధ్యాహ్నం 2.20 గంటలకు నరసాపురంలో బయలు దేరుతుందన్నారు. గుంటూరు, నంద్యాల, అనంతపురం, ధర్మవరం, హిందూపురం మీదుగా ఉదయం 8.55కు యశ్వంత్‌పూర స్టేషన్‌కు సమీపంలోని యలహంక జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. తిరిగి అక్కడ 9గంటలకు బయలు దేరి చిక్‌బన్వర్ మీదుగా మధ్యాహ్నం 12.45 గంటలకు అరిశికరే వెళుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఆయా నెలల్లో ప్రతి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు 07202 నెంబర్‌తో అరిశికరేలో బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు నరసాపురం చేరుతుందన్నారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు

ఏలూరు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏలూరు మీదుగా నడుస్తున్న 2 ప్రత్యేక రైళ్లను వేసవి రద్దీ దృష్ట్యా పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. రైల్ నెంబర్ 07165 హైదరాబాద్ నుంచి కటక్ వెళ్లే ప్రత్యేక రైలు ప్రతి మంగళవారం నడుపుతున్నారు. ఈ రైలును ఏప్రిల్ 1 నుంచి జూన్ 24 వరకూ నడపనున్నారు. రైల్ నెంబర్ 07166 కటక్ నుంచి హైదరాబాద్ ప్రతి బుధవారం నడుస్తున్న ప్రత్యేక రైలు ఏప్రిల్ 2 నుంచి జూన్ 25 వరకూ వేసవి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వృద్ధురాలి దారుణ హత్య

- కాళ్లు, చేతులు కట్టి.. నోట్లో చీరను కుక్కి, మెడకు ఉరి.. పెట్రోలు పోసి నిప్పు
- ఏలూరులో దుండగుల కిరాతకం
- 10 కాసుల బంగారం, నగదు అపహరణ

ఏలూరు క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో జరిగిన సంఘటన వెలుగు వచ్చిన తర్వాత స్థానికులకు తెలియడంతో ఒక్కసారి భయభ్రాంతులకు గురయ్యారు. ఒంటరిగా ఉంటున్న చనపతి రమణమ్మ (65) చీటీల వ్యాపారం నిర్వహిస్తుంది. ఆమెను దుండగులు తాళ్లతో కాళ్లు, చేతులు కట్టి, నోటిలో కాటన్ చీర కుక్కి, మెడకు నైలాన్‌తాడుతో ఉరి బిగించి హతమార్చారు. తరువాత పెట్రోలు పోసి నిప్పంటించేశారు. ఎలాంటి సాక్ష్యం లేకుండా చేయడానికి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు వెన్నవల్లివారిపేటలో నివాసం ఉంటున్న చనపతి రమణమ్మ (65) భర్త రాఘవరావు 20 ఏళ్ల క్రితం గుండెపోటుతో మరణించాడు. రమణమ్మ కుమార్తె రాజ్యలక్ష్మికి నవాబుపేటకు చెందిన ఎల్ఐసీ ఏజెంటు పెంటా శ్రీనివాసరావుతో వివాహం చేశారు. రమణమ్మ ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్నారు. ఎదురుగా ఉన్న మరో రేకు షెడ్డును అద్దెకు ఇచ్చింది. గురువారం రాత్రి 10.30 గంటలకు ఇరుగు పొరుగువారితో మాట్లాడిన తర్వాత ఆమె నిద్రపోయింది. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో సమీపంలోని ఒక ఇంటి వారి కుక్క పెద్దగా మొరగడంతో రాఘవమ్మ ఇంట్లో అద్దెకు ఉంటున్న కిరణ్ బయటకు వచ్చి చూశాడు. రమణమ్మ ఇంటి నుంచి మంటలు, పొగ విపరీతంగా రావడం గమనించాడు. వెంటనే ఆమె అల్లుడు శ్రీనివాసరావుకు ఫోన్ చేసి చెప్పాడు. శ్రీనివాసరావు వచ్చిన తరువాత మంటలను కూడా ఆర్పారు. రమణమ్మ కాళ్లు, చేతులు కట్టివేయబడి, నోటిలో చీర కుక్కివేసి పెట్రోల్ పోసి అంటించినట్లు గుర్తించారు. మెడకు నైలాన్ తాడుతో ఉచ్చు బిగించారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐలు జి.సత్యనారాయణ, వైవి రమణ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో ఇన్‌చార్జి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, సీసీఎస్ సీఐ రాజశేఖర్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, భీమడోలు సీఐ యుజె విల్సన్, బృందాలు రంగంలోకి దిగాయి. ఎస్పీ సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్స్, పోలీసు జాగిలంతో పరిశీలించారు. వృద్ధురాలి మెడలో నాన్‌తాడు, గాజులు, చెవి దిద్దులు మొత్తం పది కాసుల బంగారు ఆభరణాలు, బీరువాలోని రూ.25 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. అల్లుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆమె ఎవరెవరికి చీటీలు ఇచ్చారు, కట్టాల్సిన వారు ఉన్నారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

హంతకుడి గుర్తింపు?

చనపతి రమణమ్మ వద్ద చీటీల సొమ్ము పాడుకుని తిరిగి చెల్లించకుండా ఉన్నవారి వివరాలపై పోలీసులు ఆరా తీశారు. పూల కొట్టులో పనిచేసే ఒక యువకుడు సుమారు రూ.2.5 లక్షలు చెల్లించకుండా ఆమెను బెదిరిస్తున్నట్లు గుర్తించారు. ఈ నేరానికి అతనే పాల్పడి ఉంటాడని ప్రాథమిక అంచనాతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. అతను ఒక్కడే ఈ నేరం చేశాడా? ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ కేసు నమోదు చేశారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ అస్మీ (ఇన్‌సెట్) రమణమ్మ (ఫైల్)

బెదిరించి.. ప్రాణం తీశాడు

- మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఫొటోలు, వీడియోలు
- చనిపోదామంటూ రెండు సార్లు పురుగు మందు తాగించిన యువకుడు
- మహిళ మృతి.. కారకుడిని శిక్షించాలంటూ బంధువుల ఆందోళన

జంగారెడ్డిగూడెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళను బలవంతంగా లోబరుచుకుని వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఆమెతో ఏకాంతంగా గడిపిన ఫొటోలు, వీడియోలు తీశాడు. తన మాట వినకపోతే పరువు తీస్తానంటూ బెదిరించాడు. తర్వాత ఇద్దరం చనిపోదామంటూ పురుగు మందు తెచ్చాడు. ఆమెతో పురుగుమందు తాగించి పారిపోయాడు. ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. కొయ్యలగూడెం మండలం యర్రంపేటకు చెందిన దార్ల హేమదుర్గ ప్రసన్న (31) మృతదేహంతో ఆమె మృతికి కారణమైన యువకుడి ఇంటి వద్ద బంధువులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. మృతురాలి తండ్రి ఈశ్వరాచారి ఫిర్యాదుతో జంగారెడ్డిగూడెం ఎస్ఐ ఎస్‌కే.జబీర్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..

జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామానికి చెందిన గెడ్డం ఈశ్వరాచారి కుమార్తె హేమదుర్గకు 2014లో కొయ్యలగూడెం మండలం యర్రంపేట గ్రామానికి చెందిన దార్ల రాంప్రసాద్‌తో వివాహమైంది. ఆమెకు ఇద్దరు సంతానం. ఈ నేపథ్యంలో కొయ్యలగూడెం మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన మోదుగ పెద్దసాయి ఆమె వెంటపడి బలవంతంగా లోబరుచుకున్నాడు. ఇద్దరూ ఏకాంతంగా గడిపిన ఫోటోలు, వీడియోలు సెల్‌ఫోన్‌లో తీసి తన మాట వినకపోతే సోషల్ మీడియాలో పెట్టి పరువుతీస్తానని ఆమెను బెదిరించాడు. ఫిబ్రవరి 7న యర్రంపేటలోని హేమదుర్గ ఇంటికి వెళ్లిన పెద్దసాయి ఇద్దరం కలిసి పురుగుమందు తాగి చనిపోదామని చెప్పి ఆమెతో పురుగుమందు తాగించాడు. గమనించిన స్థానికులు ఆమెను కొయ్యలగూడెం ఆసుపత్రిలో చేర్పించగా వారం రోజులు చికిత్స అనంతరం ఆమె పేరంపేటలోని తండ్రి ఇంటి వద్ద ఉంటుంది. 15 రోజుల తర్వాత పేరంపేటలో ఉంటున్న మహిళ వద్దకు మోదుగ పెద్దసాయి వచ్చి గొడవ పెట్టుకుని వెళ్లాడు. మరోసారి ఈ నెల 26న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెద్దసాయి పురుగు మందు డబ్బా తీసుకు వచ్చి ఇద్దరం చనిపోదామని ఆమెను ప్రేరేపించాడు. ఆమె నొప్పితో కేకలు వేయడంతో పెద్ద సాయి పారిపోయాడు. వెంటనే బంధువులు, స్థానికులు జంగారెడ్డిగూడెం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దీనితో మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.



ఆందోళన ప్రాంతానికి ద్విచక్ర వాహనంపై మృతదేహం తరలిస్తున్న బంధువులు

మృతదేహంతో నిరసన

వివాహేతర సంబంధం పెట్టుకుని, మహిళను పురుగుమందు తాగేలా ప్రేరేపించి ఆమె మృతికి కారణమైన మోదుగ పెద్దసాయి ఇంటివద్ద మృతదేహంతో ఆమె కుటుంబసభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఆమె మృతికి కారణమైన పెద్దసాయిని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని యర్రంపేట తీసుకువెళ్లారు. యర్రంపేట నుంచి గంగన్నగూడెం మృతదేహంతో ధర్నా నిర్వహిస్తారని తెలుసుకున్న కొయ్యలగూడెం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై గంగన్నగూడెం తీసుకువెళ్లి ఆందోళన చేపట్టారు. రాత్రి 11 గంటల వరకు ఆందోళన కొనసాగింది.

జీవ శాస్త్ర పరీక్షకు 582 మంది గైర్హాజరు

భీమవరం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి జీవ శాస్త్ర పరీక్షకు శుక్రవారం 23,820 మంది విద్యార్థులకు 23,238 మంది హాజరయ్యారు. 582 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ సాంఘిక శాస్త్ర పరీక్షకు 460 మందికి 359 మంది విద్యార్థులు హాజరై 101 మంది గైర్హాజరయ్యారు. డీఈవో ఐదు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగలేదని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనాకోడేరు ఫీడర్‌పై చెట్లు, కొమ్మలు తొలగింపు కోసం ఈ నెల 29వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. గొర్లమూడి, కొమరాడ, డేగాపురం, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి గ్రామాలతోపాటు అనాకోడేరు, కొమరాడ ఇండస్ట్రియల్ లైన్లకు, ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఉగాది అందరిలో సంతోషం నింపాలి : కలెక్టర్

భీమవరం టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం ఆరంభమవుతోందని, ఈ ఏడాది అందరి జీవితాల్లో సంతోషం నింపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నాగరాణి ఉగాది వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నిర్వాహకులు కాంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 30న భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని, 50 మంది విశిష్ట సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలను అందిస్తున్నామని తెలిపారు.

సోపానం ఇంటర్వ్యూలు

పెంటపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అలంపురం, బీ.కొండేపాడు తదితర గ్రామాలకు చెందిన స్వయం ఉపాధి సోపానం దరఖాస్తుదారులకు ఆయా బ్యాంక్ మేనేజర్లు ఇంటర్వ్యూలు చేశారు. మండలంలో ఇప్పటివరకు 1390 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో సుమారు 800 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో చీకట్ల బాలాజీ వెంకటరమణ తెలిపారు.

ఆచంట: స్వయం ఉపాధి సోపానం పథకం కింద వివిధ రుణాల కోసం ఆచంట, కోడేరు, కొడమంచిలి, పెనుమంచిలి, పెదమల్లం, శేషమ్మచెరువు గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

లేఖ రచనలో హెచ్‌ఎంకు బహుమతి

తణుకు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రచనా వ్యాసాంగం విద్యార్థులు, యువతలో సృజనాత్మకత పెంపులో ముఖ్యపాత్ర పోషిస్తుందని ఏఎస్పీ ఎం.సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం తపాల శాఖ లేఖ రచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన ఏకేటీపీ స్కూలు హెచ్‌ఎం రామకృష్ణకు రూ. 25 వేల నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టి రచనలు చేపట్టాలన్నారు. తణుకు హెడ్ పోస్ట్‌మాస్టర్ సుబ్బారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరిమిల్లిపై విమర్శలు తగవు: ఆనాల

అత్తిలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అత్తిలి మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక వాయిదా పడటంపై మాజీ మంత్రి కారుమూరి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను విమర్శించడం తగదని టీడీపీ అత్తిలి మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో అప్రజాస్వామికంగా రంభ సుజాత ఎంపీపీగా ఎన్నిక కావటాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని అందుకే ఆమెను మరోసారి ఎంపీపీగా ఉండటానికి వీలులేదంటూ ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారన్నారు. తమ పార్టీకి చెందిన ఎంపీటీసీలను బెదిరించారని వారు ఎక్కడ ఉన్నారని ప్రజలు ప్రశ్నించారని వివరించారు. దీనిని ఎమ్మెల్యేపై నెపం వేయడం తగదన్నారు. అత్యధిక మెజార్టీతో గెలిచిన ఆరిమిల్లిని విమర్శించే అర్హత కారుమూరికి లేదన్నారు.

తాడేపల్లిగూడెం డిపో మీదుగా విజయవాడ డీలక్స్ బస్సులు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తణుకు నుంచి విజయవాడ వెళ్లే ఆల్ట్రా డీలక్స్ బస్సులు తాడేపల్లిగూడెం డిపో మీదుగా వెళ్లే ఏర్పాటుచేసినట్టు తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి, తణుకు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ తెలిపారు. తాడేపల్లిగూడెం ఆర్టీసి డిపోలో వారు మాట్లాడుతూ ఈ బస్సులు ఉదయం 9-10, 9-55, 10-40, 11-25, 12-25, సాయంత్రం 4-55, 5-40 సమయాల్లో అందుబాటులో ఉంటాయని వివరించారు. తణుకు తాడేపల్లిగూడెం డిపో హైద్రాబాద్ బస్సులకు కూడా ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, పూళ్ల, కైకరం, భీమడోలు రైల్వేగేట్, గుండుగొలను సెంటర్‌లలో పికప్ పాయింట్స్ ఏర్పాటుచేశామన్నారు.

రేపు వేమగీత పుస్తకావిష్కరణ

భీమవరం టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని ఈ నెల 30న ఆనంద ఫంక్షన్ హాల్లో వేమన 500 పద్యరత్నాల వేమగీత పుస్తక ఆవిష్కరణ జరుగుతుందని నిర్వాహకులు కలిదిండి సుబ్బరాజు, దాయన చంద్రజీ, ఎ. నరసింహరాజు, కంతేటి వెంకటరాజు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని 30న ఉదయం 10 గంటలకు ఆనంద ఫంక్షన్ హాల్ లో జస్టిస్ ఆకుల శేషసాయి, పద్మశ్రీ డా. ఎం.ఆర్. రాజు, డా.జి.గోపాలరాజు, విశ్లేషకులు ప్రొఫెసర్ అద్దంకి శ్రీనివాస్ లు ఆవిష్కరిస్తారని తెలిపారు. పాండు రంగరాజు, అల్లూరి భరత్ కుమార్ పాల్గొన్నారు.

పరిశుభ్రత నిరంతర ప్రక్రియ

తణుకు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత పాటించడంలో అలసత్వం వహిస్తే అనారోగ్యానికి బాటవేసుకున్నట్టేనని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సొసైటీ రోడ్డులోని సచివాలయాల పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. చెత్తను డ్రైన్‌లలో వేయవద్దని, చెత్త సేకరించే వారికి ఇవ్వాలని చెప్పారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు.



బీసీ ఫెడరేషన్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలి

భీమవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా స్వతంత్ర బీసీ ఫెడరేషన్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని బీసీ సంఘాల నేతలు పాకా సత్యనారాయణ, వీరవల్లి శ్రీనివాస్, పీవీ రమణయ్య పేర్కొన్నారు. శుక్రవారం భీమవరంలో స్వతంత్ర బీసీ ఫెడరేషన్ జిల్లా స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రద్దు చేసి స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 42శాతంకు పెంచి ఏబీసీడీఈలుగా వర్గీకరించాలని డిమాండ్ చేశారు. పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

భీమవరం అర్బన్, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని బేతని చర్చ్ పాస్టర్ ఎస్. డానియేల్ అన్నారు. ప్రవీణ్ మృతికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి వారి మృతికి సంతాపం తెలిపారు. ఇందిరా, సుగుణలీల, సౌభాగ్యరాణి, గంటా అనితారాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాటకోత్సవాలు

ఉత్తమ ప్రదర్శనగా అసత్యం ఎంపిక

వీరవాసరం/భీమవరంటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల బారత 11వ వార్షిక నాటకపోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా విశాఖపట్నం వారి చైతన్య కళా స్రవంతి ప్రదర్శించిన అసత్యం నాటిక ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గుంటూరుకు చెందిన కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ ప్రదర్శించిన తరమెల్లిపోతోందో నాటిక ఎంపికైంది. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య ప్రదర్శించిన అనూహ్యం నాటిక జ్యూరీ ప్రదర్శనగా ఉత్తరాంధ్రకు చెందిన సౌజన్య కళా స్రవంతి వారి దేవరాగం ఎంపికైంది. ఉత్తమ రచనగా దేవరాగం కేకేఎల్ స్వామి, ఉత్తమ దర్శకుడిగా అసత్యం నాటక దర్శకుడు బాలాజీ నాయక్, ఉత్తమ నటుడుగా తరమెల్లిపోతున్నదో నాటికలో రాఘవరావు పాత్రధారి బొమ్మిడి రామకృష్ణ, ఉత్తమ నటిగా ఆంగికం భువనం యశ్వ నాటికలో సునంద పాత్రధారిణి కరణం సరిత, ఉత్తమ ప్రతినాయకురాలిగా ఆశకదరా శివలో కరుణ పాత్రధారిణి డాక్టర్ శ్రీజ సాదినేని, ఉత్తమ హాస్యనటుడు అనూహ్యం నాటకంలో ధనుష్కోటి పాత్రధారి గుడాల హరిబాబు, ఉత్తమ సంగీతం అసత్యం నాటికకు లీలామోహన్, ద్వితీయ ఉత్తమ నటుడు అనూహ్యంలో ఆనందరావు పాత్రధారి రాజర్షి, ద్వితీయ ఉత్తమ నటి దేవరాగంలో కూతురు పాత్రధారి జ్యోతిరాణి, ఉత్తమ క్యారెక్టరు నటుడు దేవరాగంలో తండ్రి పాత్రధారి దములూరి సత్యనారాయణ, ఉత్తమ క్యారెక్టరు నటి అనూహ్యంలో రంజిత పాత్రధారి ఎన్. మాధవి ఎంపికైయ్యారు. ఉత్తమ రంగాలంకరణలో తరమెల్లిపోతున్నదో శ్రీధర్, జ్యూరీ బహుమతి దేవుడు కనిపించాడు నాటకంలో శాంతమ్మ పాత్రధారిణి శ్రీలేఖ, ద్వితీయ బహుమతి అసత్యంలో బసవయ్య పాత్రధారి పి రామరావు ఎంపికైయ్యారు. న్యాయ నిర్ణేతలుగా గంటా రామమోహనరావు, అల్లు రామకృష్ణ, గంటా ముత్యాల రావు నాయుడు వ్యవహరించారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలేవీ?

గోరింటాడ సొసైటీ సర్వసభ్య సమావేశంలో సభ్యులధ్వజం



ప్రత్యేకాధికారికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

పాలకొల్లు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సొసైటీలో జరిగిన నిధులు దుర్వినియోగంపై చర్యలేవని గోరింటాడ సొసైటీ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. పాలకొల్లు మండలం గోరింటాడ సొసైటీ సర్వసభ్య సమావేశం శుక్రవారం ప్రత్యేకాధికారి పి.విజయశ్రీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సభ్యులు, రైతులు సొసైటీలో జరిగిన అక్రమాలపై ప్రత్యేకాధికారికి ఫిర్యాదులు అందజేశారు. గతంలో సొసైటీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ జరిపారన్నారు. గత సర్వసభ్య సమావేశంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరామని అయినప్పటికీ ఇంతవరకూ సహకార ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని సమావేశంలో పలువురు ధ్వజమెత్తారు. దీనిపై ప్రత్యేకాధికారి విజయశ్రీ మాట్లాడుతూ చర్యలు తీసుకునే దిశగా అధికారులు కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో రైతులు అందించిన ఫిర్యాదులను స్వీకరించారు. ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామన్నారు. సొసైటీ కార్యదర్శి వి.వెంకటేశ్వబాబు అజెండా అంశాలను నివేదించారు. సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

విద్యుత్ భారం తగ్గించాలి

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు



భీమవరం స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం వేల్పూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు బళ్ల చినవీరభద్రరావు మాట్లాడుతూ ట్రూ అప్, సర్దుబాబు చార్జీలను రద్దు చేయాలని కోరారు. వినతి పత్రాన్ని సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ ఎన్ సత్య కృష్ణకు అందజేశారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలపై కూటమి ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల భారం రద్దుచేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలోని జయలక్ష్మి థియేటర్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఈకి వినతిపత్రం సమర్పించారు. నాయకులు జవ్వాది శ్రీను, సత్తి కొదండ రామిరెడ్డి, మీసాల శ్రీను, దేశంశెట్టి సతీష్, పెనుగంటి దుర్గా, తదితరులు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: ప్రజలపై విద్యుత్ భారం వేయమని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. శుక్రవారం సబ్ స్టేషన్ వద ధర్నా నిర్వహించారు. నాయకులు వాసుదేవరావు, డి. కల్యాణి, ఎం. రామాంజనేయులు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: సర్దుబాటు ఛార్జీలు రద్దు చేసి స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలంటూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి త్రిమూర్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఏఈకి వినతిపత్రమిచ్చారు.

కాళ్ల: స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం కాళ్ళ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లు పెట్టే ఉద్దేశాన్ని మానుకోవాలని, పెరుగుతున్న కరెంట్ ఛార్జీలను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నాయకర్, కలెక్టర్‌కు బొకే ఇస్తున్న ముస్లిం పెద్దలు



పాలకొల్లులో మంత్రి నిమ్మల, అంగర ప్రార్థనలు

రంజాన్ పరమ పవిత్రం

ఇఫ్తార్ విందులో వక్తలు

నరసాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ మాసమని ప్రభుత్వ విప్ నాయకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో జనసేన ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా నాయకర్, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం విచ్చేశారు. ముందుగా ముస్లిం సోదరులతో కలసి నమాజ్ చేశారు. అనంతరం నాయకర్ మాట్లాడుతూ ఏడేళ్లుగా ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. వక్ఫ్ ఆస్తుల్ని పరిరక్షించి ముస్లింలకు అన్ని విషయాల్లోనూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ పవిత్ర మాసంలో ఉపవాసాన్ని పాటిస్తూ దానధర్మాలు చేయడం గొప్ప విషయమన్నారు. టీడీపీ ఇన్‌చార్జి రామరాజు మాట్లాడుతూ మత సామరస్యానికి నరసాపురం నిలువుటద్దమన్నారు. సబ్ కలెక్టర్ దాసిరాజు, డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

పాలకొల్లు అర్బన్: ముస్లింల భక్తికి రంజాన్ మాసం నిదర్శనమని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం రాత్రి పెద్ద మసీదులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు మంత్రి రామానాయుడు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, మహ్మద్ జానీ, షేక్ మహబూబ్ జానీ, షేక్ సిలార్, ముస్లిం పెద్దలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇక్కడ ఇల్లు కట్టలేం!

(5వ పేజీ తరువాయి)

స్థలాల కోసం మొత్తం 25 లే-అవుట్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 3,857 మంది నివాస పట్టాలను అందజేశారు. 3,286 మందికి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేసింది. ఇప్పటివరకు 1,063 ఇళ్లు పూర్తయ్యాయి. వాటిలో ఇంకా 1,711 ఇళ్లు పలు దశలలో నిర్మాణంలో వున్నాయి.

ఒక్క ఇల్లూ నిర్మించని లే-అవుట్‌లు 3

తణుకు రూరల్ కొమరవరంలో రెండు లే-అవుట్‌లు శ్మశానం అవతలవైపున ఉండడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. మొత్తం 122 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ రెండు లే అవుట్‌లు శ్మశానానికి సరిహద్దుగా ఉండడంతో భయపడుతు న్నారు. వేరేచోట స్థలం ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు. యర్రాయి చెరువుకు చెందిన పేదలకు పైడిపర్రు లే అవుట్‌లో స్థలాలు ఇవ్వడం వల్ల సుమారు పది కిలో మీటర్ల దూరం కావడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు.

శ్మశానంలో నివశించలేం..



కొమరవరంలో శ్మశానం వద్ద ఇంటి స్థలం ఇచ్చారు. శ్మశానం దాటిన తర్వాత సరిహద్దులో ఇల్లు కట్టుకోవాలంటే భయంగా వుంది. చిన్న పిల్లలతో రాత్రి సమయంలో వెళ్లాలంటే భయంగా ఉంది. ఈ విషయం అప్పటి అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. వేరే చోట ఎక్కడైనా స్థలం ఇచ్చి ఆదుకోవాలి.

- బొంతా శ్రీలక్ష్మి కొమరవరం



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని

అభివృద్దే ధ్యేయం: పితాని

పెనుగొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెనుగొండలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పెనుగొండ కోడిపందేల దిబ్బ వద్ద వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెనుగొండ పార్కు నూతనంగా తీర్చిదిద్ది పునః ప్రారంభించారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని, ఎస్‌వీకేపీ కరస్పాండెంట్ కె. రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

భూ కొలతల పరిశీలించిన జేసీ

దేవలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పూర్తి చేసిన అనంతరం రైతులు అభ్యంతరాలపై జేసీ రాహుల్ కుమార్ రెడ్డి అధికారులతో వెళ్ళి పరిశీలించారు. కొలతలు సరిగా ఉండడంతో అభ్యంతరాలు తెలిపిన రైతులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఉగాది కవితల పోటీ విజేతలు

పాలకొల్లు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సాహితీ సంస్థ రసధుని నిర్వహించిన ఉగాది కవితల పోటీల్లో ప్రథమ బహుమతి ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ , ద్వితీయ బహుమతి డి. శ్రీనివాస్, తృతీయ బహుమతి చిలుకూరి సూర్య ప్రసాద్‌కు లభించాయని అధ్యక్ష కార్యదర్శులు కొట్లు భాస్కరరావు, జయదుర్గారావు, తెలిపారు. ప్రోత్సాహక బహుమతులుగా మరో ముగ్గురి కవితలు ఎంపిక అయ్యాయని, 30న బహుమతులి స్తామన్నారు.





బలుసులమ్మ, మహంకాళమ్మ వార్లు

బలుసులమ్మకు కుంకుమ పూజలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం గ్రామ దేవత బలుసులమ్మ ఆలయం వద్ద ఉగాది మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి భారీ సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ నిర్వాహకులు అంజి పర్యవేక్షించారు.

ఘనంగా జాతర

పెంటపాడు: పడమరవిప్పర్రు గ్రామంలో మహంకాళమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల జాతర వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బీవీ చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నిదుల విడుదల పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

పీహెచ్‌సీల్లో మౌలిక వసతులకు

బీహెచ్‌ఈఎల్ వితరణ

భీమవరంటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చొరవతో నర్సాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు రూ. 74 లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని బీహెచ్‌ఈఎల్ ప్రతినిధుల బృందం తెలిపింది. శుక్రవారం స్థానిక విష్ణు కాలేజీ సమావేశ మందిరం నందు నిర్వహించిన దిశ సమావేశం అనంతరం కలెక్టర్‌ను కలిసి బృందం వివరించింది. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ విజ్ఞప్తి మేరకు తాము నరసాపురం నియోజకవర్గంలో పర్యటించామని, సరైన సదుపాయాలు, వైద్య పరికరాలు లేని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సదుపాయాల కల్పనకు బీహెచ్‌ఈఎల్ నుంచి రూ. 74 లక్షలు కేటాయించినట్లు సంస్థ ఏజీఎం మీనా తెలిపారు.

గుర్రపుడెక్కతో వర్మి కంపోస్ట్ : కలెక్టర్

పాలకోడేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహిళలు గుర్రపుడెక్క ద్వారా వర్మి కంపోస్ట్, వివిధ వస్తువులు తయారు చేసి మార్కెటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని, దీనికి సంబంధించిన చర్యలను వేగవంతం చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం గొల్లలకోడేరు వంతెన వద్ద డ్రెయిన్‌లో గుర్రపుడెక్కను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అక్కడ ఉన్న మహిళలతో గుర్రపుడెక్కను ఎలా సద్వినియోగం చేయవచ్చు, ఆదాయం ఎలా పొందవచ్చో వివరించారు.

బ్యూటీషియన్ కోర్సు పరిశీలన

పాలకోడేరు మండల సమాఖ్య భవనంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సును కలెక్టర్ పరిశీలించారు. మహిళలకు సెర్ప్ ద్వారా అందజేస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆమె శుక్రవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డీఆర్‌డీఏ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సును జిల్లాలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, తహసీల్దార్ విజయలక్ష్మి, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

600 మందికి సేమ్యా పంపిణీ

పాలకొల్లు అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రసూల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం వెలమగూడెం సెంటర్‌లో 600 మందికి సేమియాను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు షేక్ రసూల్ మాట్లాడుతూ ముస్లింల పవిత్రమాసం రంజాన్ పండుగకు సేమ్యా పాయసం వండి పంపిణీ చేయడం ఆచారం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ వలీఖాన్, హజరత్, మాహీరా, బాబాజీ, చాంద్ బీబీ, బోసు, అట్టాడ సీతారాం, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో సిబ్బంది గైర్హాజరుపై

జడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం

మెమోలు ఇవ్వాలని ఎంపీడీవోకు ఆదేశం

గణపవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మొయ్యేరు సచివాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో గ్రామ సచివాలయ సిబ్బంది లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. విధులకు రాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా ఎంపీడీఓ బేబి శ్రీలక్ష్మికి ఆదేశించారు. పల్లెల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఉద్యోగులు నివాసాలుండాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. తనిఖీల్లో భాగంగా హాజరుపట్టీలు, రికార్డులను ఆమె పరిశీలించారు. సచివాలయానికి రాని సిబ్బందికి జడ్పీ చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు మెమోలు జారీ చేశామని ఎంపీడీఓ బేబి శ్రీలక్ష్మి తెలిపారు.



నిత్యావసరాలను అందిస్తున్న తెన్నేటి సురేష్

పేదలకు నిత్యావసరాల వితరణ

నరసాపురం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లాకుపేటకు చెందిన 100 మంది పేదలకు నిత్యావసరాలను శుక్రవారం సంఘం అధ్యక్షుడు తెన్నేటి సురేష్ అందించారు. షాలేమ్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గత 20 ఏళ్లుగా సంస్థ తరఫున మెడికల్ క్యాంపులు, వృద్ధులు, వితంతువులకు వస్త్రాలు, అన్నదానం నిర్వహించామన్నారు. దానిలో భాగంగా నిత్యావసరాలను పేదలకు పంపిణీ చేశారు. రత్నకుమారి, సునీత, కుమారి పాల్గొన్నారు.



అగ్నిప్రమాద బాధితులకు..

యలమంచిలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గుంపర్రు అరుంధతి పేట అగ్నిప్రమాద బాధితులు అయినవల్లి ఆనందరావు, రాంబాబు కుటుంబాలకు కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జడ్డు రామకృష్ణ సమకూర్చిన బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలను బీజేపీ మండల అధ్యక్షుడు తోలేటి లక్ష్మీనారాయణ అందజేశారు. నంబుల రంగారావు, జడ్డు వెంకటేశ్వరరావు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



కృష్ణమోహన్, నగర పంచాయతీ కమిషనర్

- **కొన్ని వార్డుల్లో ఏళ్ళ తరబడి ఏడాది పొడవునా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది?**

  జవాబు: శివారు ప్రాంతాల్లో కొన్నిచోట్ల పైపులైన్ల సమస్య వల్ల తాగునీరు సరఫరా కాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా పంపిస్తున్నాం.

- **ఈ సమస్య ఎప్పటికి పరిష్కరిస్తారు?**

  జవాబు: అమృత 2.0 ప్రాజెక్టు ద్వారా త్వరలో కొత్త పైపులైన్లు వేయడం, ట్యాంకుల నిర్మాణంతో సమస్య పరిష్కారం అవుతుంది.

- **డంపింగ్‌యార్డు సమస్య ఎప్పటికి పరిష్కరిస్తారు?**

  జవాబు: స్థలాలు పరిశీలిస్తున్నాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

- **సచివాలయాల్లో పాలన కుంటుపడుతోంది?**

  జవాబు: సిబ్బంది లేరు. ఉన్న సిబ్బందితోనే పనులు చేపడతున్నాం.

(ఆంధ్రజ్యోతి-ఆకివీడు)

మార్కెట్ పాట నేటికి వాయిదా

నరసాపురం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మార్కెట్ పాట శనివారానికి వాయిదా పడింది. శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో పాటను నిర్వహించారు. అయితే పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో శనివారానికి వాయిదా వేసినట్లు కమిషనర్ అంజయ్య ప్రకటించారు. ఇప్పటికి రెండు సార్లు రద్దు అయింది. శనివారం మూడోసారి కూడా పాట రద్దు అయితే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి మార్కెట్ పన్నును మునిసిపల్ సిబ్బంది వసూలు చేయాల్సి ఉంటుంది.

పంట నష్టపరిహారం చెల్లించాలి

భీమవరం రూరల్/అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత సార్వా సీజన్‌లో మునకకు గురై పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు రావాల్సిన పంట నష్టపరిహారం ఇవ్వలేదని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆరోపించారు. జిల్లాలో 17 మండలాల్లో 135 గ్రామాల్లో 10,900 ఎకరాలు పైబడి పంటలు మునకకు గురై దెబ్బతిన్నాయన్నారు. ఈ దశలో వ్యవసాయ అధికారులు 8729 మందికి రూ. 9 కోట్ల 54 వేలు పంటనష్టం అంచనాలు పంపారని తెలిపారు. జిల్లాలో దాళ్వా పంట చేతికొస్తున్నా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంటనష్టం ఇవ్వకపోవడం దారుణమన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

భీమవరం టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వమని శ్రీఉమా సోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వేలూరి హనుమ కిరణ్, సమాఖ్య పూర్వాధ్యక్షుడు వేలూరి బుజ్జి అన్నారు. గొల్లలకోడేరుకు చెందిన పేద బ్రాహ్మణుడు నారుమంచి కృష్ణ ప్రసాద్ కుమార్తె వివాహం నిమిత్తం రూ. 10 వేలు వబిలిశెట్టి పట్టాభి రామయ్య భార్య పద్మావతి వారికి అందించారు. దర్భ అచ్యుత శర్మ, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

2న ఇళ్ల స్థలాల కోసం ధర్నా

భీమవరం అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణానికి 5 లక్షల కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అర్జీదారులతో వ్యక్తిగత దరఖాస్తులు కలెక్టర్‌కు సమర్పించే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అర్జీదారులు పాల్గొనాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శుక్రవారం లంకపేట, దుర్గాపురం ప్రాంతాల్లో ఇళ్ళులేని పేదలతో అర్జీలను పూర్తి చేయించారు. సీపీఐ నాయకులు సీతారాం ప్రసాదు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు

కాళ్ళ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏలూరుపాడు గ్రామానికి చెందిన యాళ్ళ యోహానుపై పాత గొడవలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన బండి భవానీశంకర్, రామకృష్ణ అనే వ్యక్తులు గురువారం రాత్రి ఇంటికి వచ్చి కర్రతో దాడి చేశారంటూ యోహాను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు కాళ్ల ఎస్ఐ ఎన్. శ్రీనివాసరావు తెలిపారు.

దొంగతనం కేసులో ముద్దాయికి జైలు, జరిమానా

నరసాపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ దొంగిలించిన ఘటనలో ముద్దాయికి ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ.2వేలు జరిమానాను జిల్లా అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ విధించారు. కోర్టు లైజన్ ఏఎస్ఐ కె.భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పూట నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తి చేతి నుంచి మొబైల్ దొంగిలించిన తిరుమాని చక్రధర్‌పై 2022లో కేసు నమోదైంది. అప్పటి ఎస్ఐ కె.సుధాకర్ రెడ్డి కేసు నమోదు చేసి సెల్ రికవరీ చేశారు. గురువారం ఈ కేసు విచారించిన సివిల్ జడ్జి నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ఏపీపీ ఎంఏ అహ్మద్ వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుళ్ళు బి.శ్రీనివాస్, వల్లభరాయుడు ముద్దాయిని హాజరు పర్చడంలో సహకరించారు.